క్లుప్తంగా

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, బాలబోగం, నైవేద్యం వితరణ తదితర పూజా కార్యక్రమాలు ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భీమవరం, తణుకు పరిసర ప్రాంతాల భక్తులు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అయ్యప్ప, భవాని, గోవింద మాలధారులు స్వామిని దర్శించుకున్నారు. సరిపల్లి గ్రామం ఆవల పేరాజుగారు, అప్పసాని రవికుమార్ కుటుంబం సభ్యులు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

వలంటీరు సేవాదృక్పథం



నల్లజర్ల వెళ్లి శేషమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాణి

కొయ్యలగూడెం: పొరుగు జిల్లా వెళ్లి ఓ పింఛన్ లబ్ధిదారుకి పింఛన్ మొత్తాన్ని అందజేసి వలంటీర్ సేవా దృక్పథం చాటుకుంది. వివరాల ప్రకారం కొయ్యలగూడేనికి చెందిన పింఛన్ లబ్ధిదారు శేషమ్మ అనారోగ్య కారణాలతో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఆమె కుమార్తె ఇంటి వద్ద చికిత్స పొందుతుంది. ఆమెకు అందించాల్సిన వృద్ధాప్య పింఛన్ నగదును వలంటీర్ జేఎస్ రాణి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సిరాజుతో కలసి నల్లజర్ల వెళ్లి పింఛన్ అందజేసింది. దీంతో శేషమ్మ కుటుంబ సభ్యులు వలంటీర్‌కు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేస్తున్న ఎంపీపీ శాంతి

బుట్టాయగూడెం: తెల్లంవారిగూడెంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ కారం శాంతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు కారం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు మొక్కను అందిస్తున్న ఆర్డీవో అద్దయ్య

ద్వారకాతిరుమల: జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్డీవో కుంభా అద్దయ్యకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. ఇటీవల ఆర్డీవోగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అద్దయ్య, ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలసి, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై ఆర్డీవోతో ఎమ్మెల్యే చర్చించారు. ఆర్డీవో వెంట ద్వారకాతిరుమల తహసీల్దార్ పి.సతీష్ ఉన్నారు.

ధర్మారావుపేటలో ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీ పరిధి ధర్మారావుపేటలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.విజయకృష్ణ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ దీర్ఘకాలిక రోగాలకు సంబంధించి రోగులకు అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం వలన గ్రామీణ ప్రాంత ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వంటివి ప్రభుత్వం నిర్వహిస్తూ ఉండాలని ప్రజలు పేర్కొంటున్నారని విజయకృష్ణ పేర్కొన్నారు. ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి

చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



కామవరపుకోటలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆంధ్రాకి జగన్ ఎందుకు కావాలి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్య దీవెన, రైతు భరోసా, జగనన్న ఇంటి పథకం వంటి ఇంకా అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకుల మోసపూరితమైన మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యే దిశగా పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసులు విజిలెన్స్ మోనటరింగ్ మెంబర్ గుర్రాల రవికుమార్, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ నానాది సాగర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సాయిల స్వాతి, మండల సచివాలయ కన్వీనర్లు పండు ప్రసన్న, షేక్ మీరా సాహెబ్, తడికలపూడి సచివాలయం కన్వీనర్ వి.శ్రీను, మండల బూత్ కన్వీనర్ బోట్ల లక్ష్మణ్, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, సాగిపాడు సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, గృహ సారథులు సచివాలయ వలంటీర్లు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధానికి సన్నద్ధం కండి

వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు



కొయ్యలగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200వ రోజు పోస్టర్ల ఆవిష్కరణ



పోలవరంలో వైఎస్సార్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న విజ్జు వెంకటేశ్వరరావు

కొయ్యలగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికలు పెత్తందారి పార్టీలకు, పేదవాడి పార్టీ అయిన వైఎస్సార్ సీపీకి మధ్య జరిగే ధర్మయుద్ధమని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రాకు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ఏ సమయంలో వచ్చినా మేమంతా 'ఫ్యాన్ ఫాన్సే' అని ఎనభై శాతానికి పైగా ప్రజలు ఫిక్స్ అయి ఉన్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకోవడానికి వారంతా ఆత్రుతతో ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యకర్తల కృషి ముఖ్యమంత్రి విస్మరించలేదు అని మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గద్దెనెక్కిన వెంటనే ప్రతి కార్యకర్తను తగిన విధంగా గుర్తిస్తారు అన్నారు. వచ్చే ఎన్నికలలో తెల్లం బాలరాజు 50 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, జగనన్న మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా స్థానం పొందుతారని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పోలవరం నియోజకవర్గంలో రెండు వందల రోజులు పూర్తి చేసిన సందర్భంగా ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులతో కలసి పోస్టర్లు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, పార్టీ నాయకులు దాసరి విష్ణు, మంతెన సోమరాజు, ఏలేటి చిన్న తుక్కయ్య, సంకుకొండ, గంటా శ్రీను, చిడిపి రవి, మారిశెట్టి శ్రీను, కంభంపాటి బుజ్జిబాబు, మద్దు గోపి, దూలపల్లి కాంతారావు, ఏలేటి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్ కృషి

పోలవరం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలవరం పరిధిలోని అక్షయ రిసార్ట్స్‌లో వైఎస్సార్‌సీపీ పోలవరం మండల శాఖ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గా మురళీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కలుం హేమకుమారి, మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు, ఎంపీటీసీ కాశీ ధనలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్‌లు షేక్ ఫాతిమున్నీసా, దాకే మంగాయమ్మ, పార్టీ నాయకులు కోటం బాబూరావు, ఆరేటి సత్యనారాయణ, గొగ్గులోతు మోహన్‌రావు, కరిబండి శ్రీను తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో గడపగడపకు మన ప్రభుత్వం 200వ రోజు పోస్టర్‌లను ఆవిష్కరించారు.

ధర్మాజీగూడెంలో మంత్రి నాగార్జునకు స్వాగతం



బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున, పార్టీ నేతలు

లింగపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు మేరుగు నాగార్జునకు వైఎస్సార్ సీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. శనివారం మంత్రి నాగార్జున చింతలపూడిలో నూతనంగా నిర్మించిన సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభోత్సవానికి వెళుతూ మార్గమధ్యలో ధర్మాజీగూడెంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఆగారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, స్వర్గీయ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు మంత్రి నాగార్జున చేతులమీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొఠారి మోహన్, పార్టీ నాయకులు నూతులపాటి శ్రీను, గారపాటి రాంబాబు, ముళ్లపూడి సుమన్, గుండిమేడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారం పార్వతికి నివాళి



జిల్లేళ్ళగూడెంలో పార్వతి వర్ధంతి సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం సభ్యుల ప్రదర్శన

పోలవరం రూరల్: కారం పార్వతి 26వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లేళ్ళగూడెం గ్రామంలో మనుగోపుల వద్ద ఉన్న పార్వతి స్థూపం శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. అనంతరం ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు సవలం రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతుకూలీ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ 1/70చట్టాన్ని గిరిజనులు పోరాడి సాధించుకున్నారన్నారు. 2023 అటవీ సంరక్షణ చట్టం గిరిజన ప్రజలను, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తుందని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కారం దుర్గ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎర్రజెండాలు చేతబట్టి కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈశ్వరరెడ్డి

ద్వారకాతిరుమల: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ పి.సతీష్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సొసైటీ సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో దళారుల వ్యవస్థ ఉండకూడదన్నారు. రైతుల ధాన్యాన్ని ఫార్మ్ గేట్ వద్దే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి మాట్లాడుతూ గోనె సంచుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆ తరువాత మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ముల్లంగి ఈశ్వరరెడ్డి ధాన్యం కొనుగోలు విషయంపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలనిచ్చారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

జంగారెడ్డిగూడెం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి కేపీఎస్ పోశారావు తెలిపారు. గురువారం మండలంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న కోత పనులు, ధాన్యం ఆరబెట్టే ప్రక్రియలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోశారావు మాట్లాడుతూ రాబోయే 3, 4 రోజుల్లో జంగారెడ్డిగూడెం మండలంలోని 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రారంభించుచున్నామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని పంట కోసిన తర్వాత ఆరబెట్టుకొని రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

ప్రజారక్షణ భేరి విజయవంతం చేయాలి

కుకునూరు: ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరి ప్రచార బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోందని, విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ఈనెల 6 న పోలవరం చేరనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

పోలవరం రూరల్: ప్రజారక్షణ భేరి యాత్ర పేరున నిర్వహించే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకటరావు కోరారు. ఈ నెల 6వ తేదీన ఈ యాత్ర పోలవరం చేరుకుంటుందని తెలిపారు. వింజరంలో శనివారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లా కమిటీ నాయకులు కె.శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు, దుగ్గిరాల సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలంపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు లయన్స్‌క్లబ్ వారు తెలిపారు. గ్రామానికి చెందిన మేడిశెట్టి శంకర్రావు కుమార్తె ధనలక్ష్మి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. నిడదవోలుకు చెందిన ఆర్ఆర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు సేవలను అందిస్తారని, అవసరమైన వారు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవత ర్యాలీ



యర్రగుంటపల్లి గ్రామంలో మానవత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

చింతలపూడి: ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని నిరసిస్తూ మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యర్రగుంటపల్లి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మానవత అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖరాచార్యులు మాట్లాడుతూ యుద్ధం వల్ల మానవాళికి జరుగుతున్న అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ పొట్టి చక్రధరరావు, మండల మానవత కార్యదర్శి ఎ.రాజారావు, వైస్ చైర్మన్ ఎం.శామ్యూల్, అశోక్, సురేంద్ర, పెన్మెత్స రామరాజు, ఎడ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్‌ల అందజేత



కొమ్ముగూడెంలో యువకులకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

పోలవరం రూరల్: యువత విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని చూపాలని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. కొమ్ముగూడెం గ్రామంలోని యువతకు వాలీబాల్‌కిట్‌లను ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా క్రీడలపై ఆసక్తి చూపిస్తే దేహదారుఢ్యం పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగాలు సాధించి మంచి భవిష్యత్తుకు ఎదగాలన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

జంగారెడ్డిగూడెం: దీపావళి బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం దీపావళి బాణసంచా దుకాణదారులు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ దీపావళి బాణసంచా దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను నిర్దేశించిందని, దానికి అనుగుణంగా బాణసంచా దుకాణాలదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు, రెండు బకెట్లతో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకునేలా చూడాలన్నారు. కాగా డివిజన్‌లో ఏడుగురు శాశ్వత లైసెన్స్‌దారులు ఉండగా, తాత్కాలిక లైసెన్సుల కోసం 40మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ స్లీవజోజి, ఆర్డీవో కార్యాలయ ఏవో సోమేశ్వరరావు, డివిజన్‌లోని 10 మండలాలకు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



రాజానగరంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బుట్టాయగూడెం: కామయ్యకుంట, రాజానగరం, తదితర గ్రామాల్లో శనివారం వ్యవసాయాధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. ఏఓ బి.సుమలత మాట్లాడుతూ మండలంలో 9.50 ఎకరాల్లో వరి పంట, అంతర్వేదిగూడెం గ్రామాల్లో 31 ఎకరాల్లో వరి, కామయ్యకుంట, రాజానగరం, పులిరామన్నగుడెం గ్రామాల్లో పంటలు నీటి ఎద్దడికి గురైనట్లు గుర్తించినట్లు చెప్పారు.

యువ కార్యనిర్వాహకులను తయారుచేయడమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం: పాఠశాల స్థాయి నుంచి యువ కార్య నిర్వాహకులను తయారు చేయడమే తమ లక్ష్యమని కళాశాల ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శనివారం యువ కార్య నిర్వాహకులు – ప్రోత్సాహం అనే అంశంపై చరిత్ర, రాజనీతి శాస్త్ర విభాగాలు కలిసి శనివారం కార్యశాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఇప్పటికీ మూడు కార్యశాఖ శిబిరాలు, ఒక అంతర్జాతీయ, జాతీయ సదస్సు, ఏడు విభాగాల నందు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుట్టాయిగూడెం ఎంఈవో సీహెచ్.నరేంద్ర రాయ్, రిసోర్స్ పర్సన్లు డా.కే. పంకజ్ కుమార్, డా.ఎస్ఎన్. దుర్గాప్రసాద్, అధ్యాపకులు బి.అశోక్, ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మాజీగూడెంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

లింగపాలెం: ధర్మాజీగూడెంలోని ప్రసాద్ ఏసీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లింగపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యాసంస్థల బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: ఈనెల 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాలు కోరాయి. శనివారం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, ఏఐవైఎఫ్ నాయకులు సీహెచ్ సురేష్ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న వెయ్యి రోజుల నిరాహార దీక్షలకు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి యువజన సంఘాలు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

రేపు జంగారెడ్డిగూడెంలో 'శివలింగాల' ఊరేగింపు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో సోమవారం పార్థివ శివలింగాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు శివ సంకల్పమస్తు ట్రస్ట్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నుంచి నిర్వహించనున్న భారీ ఊరేగింపులో గురువు తంగిరాల రామచంద్రసాయి పాల్గొంటున్నారని తెలిపారు. కావున ఈ ఊరేగింపులో పాల్గొని కాశీ విశ్వనాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం: నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం తమకు అందిన సమాచారంతో మక్కినవారిగూడెంలో దాడులు నిర్వహించగా, అదే గ్రామానికి చెందిన చల్లపల్లి వెంకటేశ్వరరావు అక్రమంగా నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

టి.నరసాపురం: వ్యక్తి మృతిపై అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం బొర్రంపాలెంకు చెందిన జెట్టి సత్యనారాయణ (57) చేపలు పట్టేందుకు ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం ఎర్రకాలువ ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. గాలంతో చేపలు పడుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి ప్రాజెక్టులో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై సత్యనారాయణ కుమారుడు జెట్టి రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జున రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం డాంగేనగర్‌కు చెందిన అందే రాజశేఖర్‌కు, జానకికి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. రాజశేఖర్ మద్యానికి బానిసై శారీరికంగా, మానసికంగా హింసిస్తున్నాడని, దీనికి కుటుంబసభ్యులు సహకరిస్తున్నారన్నారని బాధితురాలు జానకి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సవరణ

[illegible]

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్

9951602915 (పోలవరం)

9505508399 (చింతలపూడి)

Office mail : tpgadvt@gmail.com